# భోగభాగ్యాల భోగి





**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా భోగి**

**రంగురంగుల ముగ్గులు వేసి ప్రత్యేక పూజలు చేసిన మహిళలు**

**భోగి మంటల్లో పాత వస్తువులు వేసి పీడ తొలగాలని ఇష్టదైవాలకు మొక్కులు**

**ఏ ఇంట చూసినా ఘుమ ఘుమలాడే పిండి వంటకాలే..**

**గాలిపటాలు ఎగురవేస్తూ ఆనందంగా గడిపిన చిన్నాపెద్ద**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భోగి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆడపడుచులు ఉదయాన్నే ఇండ్ల ఎదుట రంగురంగుల ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలను పెట్టి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వీధుల్లో భోగి మంటలు వేసి ఇంట్లో ఉండే పాతవస్తువులను అందులో వేసి పీడ తొలగాలని ఇష్టదైవాలను వేడుకున్నారు. చిన్నాపెద్ద గాలిపటాలను ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు. నేడు సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలు రకరకాల పిండి వంటలు చేశారు. గంగిరెద్దుల వారు, హరిదాసులు, బుడబుక్కల, జానపద కళాకారులు పల్లెల్లో సందడి చేశారు. సాయంత్రం చిన్నపిల్లలకు భోగిపళ్లు పోసి ఆనందోత్సాహాల మధ్య పేరంటాలు చేసుకున్నారు.



\- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ


నమస్తే తెలంగాణ

రంగారెడ్డి


13 | హైదరాబాద్, సోమవారం 15 జనవరి 2024 | RANGAREDDY


### 30 ఎకరాల ప్రభుత్వ స్థలంలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి నిర్ణయం

- కొండల్లోని 412 మొక్కల తొలగింపునకు అనుమతి
- అనంతగిరి ప్రాముఖ్యతను కాపాడేందుకు మరో చోటకు మెడికల్ కాలేజీ
- ఈ ఏడాది నుంచి తాత్కాలిక మెడికల్ కాలేజీలో కొనసాగుతున్న తరగతులు
- శాశ్వత మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ.235 కోట్ల నిధులిచ్చిన ప్రభుత్వం
- దాదాపు పూర్తైన 380 పడకల అనుబంధ దవాఖాన నిర్మాణ పనులు

మొదట అనంతగిరిలో నిర్మించేందుకు నిర్ణయం

అనంతగిరిలో ఎకో టూరిజం ఏర్పాటు దృష్ట్యా స్థలం మార్పు



# ప్రభుత్వ మెడికల్ కాలేజీ స్థలం మార్పు

### వికారాబాద్ మున్సిపాలిటీలోని బిల్లదాఖలాలో ఏర్పాటుకు సర్కార్ నిర్ణయం

వికారాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ) : వికారాబాద్ అంటేనే అందరికీ గుర్తుకు వచ్చేది అనంతగిరి కొండలు. అనంతగిరికా హవా లాకో మరిదోంకా దవా అనే నానుడి కూడా ఉన్నది. అనంతగిరి కొండల్లో ఉన్న ఔషధ మొక్కల గాలి పీల్చితే చాలు రోగాలు నయమవుతాయనే నమ్మకం ప్రజల్లో ఉన్నది. అభివృద్ధి అంశాన్ని దృష్టిలో పెట్టుకొని అనంతగిరిలో జిల్లాకు మంజూరైన ప్రభుత్వ మెడికల్ కాలేజీని నిర్మించేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణానికిగాను అనంతగిరి కొండల్లోని 5 వేల చెట్లను తొలగించేందుకు నిర్ణయించినా, కేవలం మెడికల్ కాలేజీ భవన నిర్మాణ స్థలం కోసం 412 చెట్లను తొలగించేందుకు అటవీ శాఖ అనుమతులనూ మంజూరు చేసింది. వికారాబాద్ అంటేనే అనంతగిరి హిల్స్ ప్రసిద్ధి. అలాంటి అనంతగిరి కొండల్లో పెద్ద మొత్తంలో చెట్లను తొలగించి ప్రాముఖ్యతను తగ్గించవద్దనే సదుద్దేశంతో కలెక్టర్ నారాయణరెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణ స్థలాన్ని మార్పు చేశారు. రూ.118 కోట్ల అనంతగిరిలో ఎకో టూరిజం ప్లాన్ చేస్తున్న దృష్ట్యా మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని మరో చోటకు మార్చారు. వికారాబాద్ మున్సిపాలిటీలోని శ్రీఅనంతపద్మనాభ కాలేజీకి సమీపంలోని బిల్లదాఖలాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. బిల్లదాఖలాలో 200 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్నది. సంబంధిత భూముల్లో 30 ఎకరాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ శాశ్వత మెడికల్ కాలేజీ నిర్మాణానికి సంబంధించిన స్థల మార్పు ప్రతిపాదనలను జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి అందజేయగా, ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు తెలిసింది. జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణానికిగాను ప్రభుత్వం ఇప్పటికే రూ.235 కోట్ల నిధులను కేటాయించిన సంగతి తెలిసిందే.

**తాత్కాలిక కాలేజీలో కొనసాగుతున్న తరగతులు..**

2023–24 విద్యా సంవత్సరం గత సెప్టెంబర్ నుంచి ప్రభుత్వ మెడికల్ కాలేజీ తరగతులు ప్రారంభం అయ్యాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీ శాశ్వత భవన నిర్మాణం రెండేండ్లలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జిలా యంత్రాంగం చర్యలు చేపట్టిన దృష్ట్యా అనంతగిరిలోని టీబీ శానిటోరియంలో తాత్కాలికంగా మెడికల్ కాలేజీ తరగతులను నిర్వహిస్తున్నారు. టీబీ శానిటోరియంలోనే రెండేండ్లపాటు తరగతులను నిర్వహించేందుకుగాను ప్రభుత్వం అనుమతించిన విషయం తెలిసిందే. రెండు లెక్చర్ హాళ్లను, అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి ల్యాబ్ గదులతో తాత్కాలిక మెడికల్ కాలేజీలో తరగతులు కొనసాగుతున్నాయి. 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 100 మంది విద్యార్థులకు ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించారు. జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రతి ఏటా 100 సీట్లను పెంచనున్నారు.

**దాదాపు పూర్తైన అనుబంధ దవాఖాన నిర్మాణ పనులు..**

ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనుబంధ దవాఖాన నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా 380 పడకలతో బోధనాసుపత్రిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకుగాను రూ.30 కోట్లతో ఏరియా ఆసుపత్రిపై మరో రెండంతస్తుల నిర్మాణాన్ని చేపట్టారు. 380 పడకల అనుబంధ దవాఖాన అందుబాటులోకి రానుండడంతో అన్నిరకాల వైద్య సేవలు జిల్లా కేంద్రంలో అందుబాటులోకి రానున్నాయి. బోధనాసుపత్రి అందుబాటులోకి వచ్చినట్లయితే 26 రకాల వైద్య సేవలు గ్రామీణ ప్రాంతంతో కూడుకొని ఉన్న జిల్లా ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఒకట్రెండు నెలల్లో జిల్లా ప్రజలకు బోధనాసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందనున్నాయి. ఐసీయూ, ట్రామా కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు ఇప్పటికే రెగ్యులర్ పోస్టుల్లో భాగంగా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, ల్యాబ్ టెక్నీషియన్, స్టోర్ కీపర్, చీఫ్ బయోకెమిస్ట్, మెడికో సోషల్ వర్కర్, గ్రేడ్–1, 2 సీనియర్, జూనియర్ రెసిడెంట్లు, ఈసీజీ టెక్నీషియన్, టీబీ అండ్ చెస్ట్ డిసీజ్ హెల్త్ విజిటర్, హెల్త్ ఎడ్యుకేటర్, చైల్డ్ సైకాలజిస్ట్, ఫిజియో థెరపిస్ట్, ఆడియోమెట్రి టెక్నీషియన్, అప్టీషియన్, థియేటర్ అసిస్టెంట్, మేల్ నర్సింగ్, బ్లడ్‌బ్యాంక్ అధికారి పోస్టులను మంజూరైన దృష్ట్యా సంబంధిత సేవలు అందుబాటులోకి రానున్నాయి. సాధారణ వైద్య సేవలు మినహా మిగతా వైద్య సేవలకై తప్పనిసరిగా జిల్లా నుంచి హైదరాబాద్‌కు వెళ్లక తప్పడం లేదు. అత్యవసర వైద్య సేవలు పొందాలంటే హైదరాబాద్‌లోని ఏదో ఒక దవాఖానకు తీసుకుపోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. మెడికల్ కాలేజీతోపాటు బోధనాసుపత్రి అందుబాటులోకి వస్తే అన్ని రకాల వైద్య సేవలు నిరంతరం అందుబాటులోకి రానున్నాయి.

### అనంతగిరి ప్రాముఖ్యతను కాపాడేందుకే స్థల మార్పు..



అనంతగిరి హిల్స్‌కు ఉన్న ప్రాముఖ్యతను కాపాడేందుకుగాను ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణ స్థలాన్ని మార్పు చేశాం. ముందు అనంతగిరిలో అనుకున్నప్పటికీ ప్రసిద్ధిగాంచిన అనంతగిరి కొండల్లో చాలా చెట్లను తొలగించాల్సిన పరిస్థితుల దృష్ట్యా మెడికల్ కాలేజీని బిల్లదాఖలాలోని 30 ఎకరాల్లో నిర్మించేందుకు నిర్ణయించాం. త్వరలోనే టెండర్ల ప్రక్రియను పూర్తి చేస్తాం.

\- సి.నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్




- శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు నేరుగా వీక్షించే అవకాశం
- పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గానికొక రైతు వేదిక ఎంపిక
- జిల్లాలో ఆరు కేంద్రాల ఏర్పాటుకు వ్యవసాయశాఖ ప్రతిపాదనలు
- జిల్లాలో 83 రైతు వేదికలు ఏర్పాటు చేసిన కేసీఆర్ సర్కార్
- నెరవేరనున్న రైతు వేదికల ఉద్దేశం

**అన్నదాతలకు మరింత చేరువగా రైతువేదికలు..**

# పరిష్కార వేదికలు..

రంగారెడ్డి, జనవరి 14 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన రైతు వేదికలతో వ్యవసాయంలో సలహాలు, సూచనలు రైతుల ముంగిట్లోకి వచ్చాయి. సాగులో అధునాతన పద్ధతులు, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..ఇలా ప్రతి సమాచారమూ రైతులకు చేరింది. ఒకప్పుడు సాగుకు సంబంధించిన ఏ సమస్యకైనా మండల కేంద్రానికో.. జిల్లా కేంద్రానికో వెళ్లాల్సిన అవసరం లేకుండా.. అప్పటి ప్రభుత్వం ఊరూరా రైతు వేదికలను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో వ్యవసాయ క్లస్టర్‌కు ఒక్కటి చొప్పున రూ.18.26 కోట్లను వెచ్చించి 83 రైతు వేదికలను నిర్మించింది. అయితే ఈ వేదికలను అన్నదాతలకు మరింత చేరువ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. తొలుత పైలట్ ప్రాజెక్టుగా నియోజకవర్గానికొక వేదిక చొప్పున జిల్లాలో ఆరు వేదికలను వీడియో కాన్ఫరెన్స్ హాల్(దృశ్య శ్రవణ కేంద్రాలు)గా రూపకల్పన చేస్తున్నది. నిపుణులైన శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు రైతులకు అందనుండడంతో రైతు వేదికల ఉద్దేశం సంపూర్ణంగా నెరవేరనున్నది.

**సకల వసతులతో వేదికల ఏర్పాటు ..**

సాగుకు అనుకూల పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో జిల్లాలో ప్రతి సీజన్‌లోనూ 3 లక్షల ఎకరాలకు పైగా పంటలను రైతాంగం సాగు చేస్తూ వస్తున్నది. పెరిగిన సాగుకు అనుగుణంగా రైతులకు సేవలను మరింత విస్తృతం చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగా ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను గుర్తించి..క్లస్టర్‌కో ఏఈవో ను నియమించింది. ప్రతి క్లస్టర్‌లోనూ రైతు వేదికలను నిర్మించి ఏఈవో నిత్యం రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నది. ఏఈవోతోపాటు కో–ఆర్డినేటర్ కోసం టేబుళ్లు, కుర్చీలు, మైక్ సిస్టంతోపాటు పలు సామగ్రిని సమకూర్చింది. ఏఈవో, రైతుబంధు సమితి కో–ఆర్డినేటర్‌కోసం రెండు గదులు, రైతుల సమావేశం కోసం ఒక మీటింగ్ హాల్ ఉండేలా రైతు వేదికలను సర్వాంగ సుందరంగా ప్రభుత్వం తీర్చిదిద్దింది. రైతులంతా వేదికలో కూర్చుని చర్చించుకునేందుకు అన్ని వసతులను సమకూర్చింది. రైతువేదికల నిర్వహణకోసం తొలుత ప్రతినెలా రూ.2 వేల చొప్పున చెల్లించిన ప్రభుత్వం ఆ తర్వాత రూ. 9 వేలకు పెంచింది.

**మరింత ప్రయోజనం..**

వానకాలం, యాసంగి పంటల సాగుపై రైతు వేదికల్లో వారానికి రెండు సార్లు (మంగళవారం, శుక్రవారం) రైతులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, చీడ,పీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఈవోలు రైతులకు సలహాలు, సూచనలను అందజేస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు మినహా మిగతా అన్ని సమయాల్లోనూ ఏఈవోలు రైతువేదికల్లో అందుబాటులో ఉంటున్నారు. వ్యవసాయంలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల సమాచారంతోపాటు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలైన రైతుబంధు, రైతుబీమా, సబ్సిడీ పథకాలపై అవగాహన కల్పించడంతోపాటు సంబంధిత పథకాలకు అర్హులైన వారి నుంచి రైతు వేదికగా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఏవో, ఏడీఏతోపాటు జిల్లా వ్యవసాయ అధికారులు, కొన్ని సందర్భాల్లో కలెక్టర్లు సైతం రైతు వేదికల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతువేదికల లక్ష్యాన్ని సంపూర్ణంగా నెరవేర్చేలా చర్యలు తీసుకుంటున్నది. ఈ మేరకు జిల్లా అధికారులు మహేశ్వరం, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో వీడియో కాన్ఫరెన్స్(దృశ్య శ్రవణ కేంద్రాలు)ల ఏర్పాటు కోసం రైతు వేదికల వివరాలను ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే అధికారులు వాటిని ఆ దిశగా కార్యరూపంలోకి తీసుకురానున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే.. నిపుణులైన వ్యవసాయ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పంటల సాగు విధానం, సస్యరక్షణ చర్యలు, తెగుళ్లు.. వాటి నివారణ చర్యలు తదితర విషయాలను నేరుగా రైతులు తెలుసుకోవచ్చు. అలాగే ప్రభుత్వ పథకాలపై ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగా తెలుసుకునే వీలు కలుగుతుంది. ఏదేమైనా.. దూరదృష్టితో కేసీఆర్ ప్రభుత్వం రైతు వేదికలను ఏర్పాటు చేసిందని రైతాంగం పేర్కొంటున్నది.

**దృశ్య శ్రవణ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించిన రైతు వేదికలివే..**

| నియోజకవర్గం | రైతువేదిక |
|---|---|
| మహేశ్వరం | కందుకూరు |
| ఆమనగల్లు | ఆమనగల్లు |
| ఇబ్రహీంపట్నం | మంచాల |
| షాద్ నగర్ | నందిగామ |
| చేవెళ్ల | చేవెళ్ల |
| రాజేంద్రనగర్ | కొత్వాల్‌గూడ |

**వికారాబాద్ జిల్లాలో నాలుగు రైతు వేదికల ఎంపిక**

బొంరాస్‌పేట : వ్యవసాయ రంగంలో నిపుణులు, శాస్త్రవేత్తలతో ప్రసంగాలు ఇప్పించడం, రైతుల సందేహాల నివృత్తి కోసం రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాన్ని తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. మొదటగా నియోజకవర్గానికి ఒక రైతు వేదికను ఎంపిక చేయాలని నిర్ణయించగా.. వికారాబాద్ జిల్లాలోని నాలుగు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కోసం వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. జిల్లాలో 99 రైతు వేదికలు ఉండగా కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేటలో, పరిగి నియోజకవర్గంలోని పూడూరులో, వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేటలో, తాండూరు నియోజకవర్గంలోని అంతారం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కోసం ప్రతిపాదనలు పంపించారు. అయితే మొదటగా ఈ నెల 15వ తేదీన సంక్రాంతి పండుగ రోజు పూడూరు రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ప్రారంభించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం పరికరాల బిగింపు కూడా పూర్తయింది.

**సామగ్రి పంపిణీ**

వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కోసం ఎంపిక చేసిన రైతు వేదికకు ఆరు రకాల సామగ్రిని అందజేస్తున్నారు. డెల్ కంపెనీకి చెందిన మానిటర్, కెమెరా, యూఎస్‌బీ, ప్యానల్ స్టాండు, విద్యుత్ ప్లగ్, కేబుల్‌ను సమకూరుస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌తో పంటల సాగులో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించుకోవడానికి వీలవుతుంది.

## ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

### తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



వికారాబాద్, జనవరి 14 : ప్రజలకు బోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ బంధుమిత్రులతో కలిసి సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

# ఆన్‌లైన్ 4 లక్షలు !

- జిల్లాలో కొనసాగుతున్న ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్
- వచ్చిన మొత్తం దరఖాస్తులు 5,53,277
- 1,439 మంది ఆపరేటర్లతో కొనసాగుతున్న డేటా ఎంట్రీ
- సంక్రాంతి సెలవులతో ఆన్‌లైన్ ప్రక్రియకు బ్రేక్!
- ఈనెల 17 గడువులోపుగా పూర్తి చేసేందుకు అధికారుల కసరత్తు
- 5 గ్యారంటీల దరఖాస్తులనే ఆన్‌లైన్ చేయిస్తున్న అధికారులు

రంగారెడ్డి, జనవరి 14 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతున్నది. ఈనెల 17 లోపుగా పూర్తి చేయాల్సి ఉండగా, ఇంకా మూడు రోజులు మాత్రమే మిగిలి ఉన్నది. గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 21 మండలాల్లోని 558 గ్రామ పంచాయతీల పరిధిలో 2,46,626 కుటుంబాలు ఉండగా.. ప్రజాపాలనలో ప్రజల నుంచి 2,91,470 దరఖాస్తులు వచ్చాయి. 16 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో 2,88,361 దరఖాస్తులు ఉండగా.. 2,61,807 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 5,53,277 దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను 1,439 మంది ఆపరేటర్ల సాయంతో చేపడుతున్నారు. ఉపాధి హామీ, సెర్ప్, మండల, రెవెన్యూ, విద్యాశాఖతోపాటు ఇతర ప్రభుత్వ విభాగాల్లో పని చేసే కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను డేటా ఎంట్రీకి ఎంపిక చేశారు. దరఖాస్తుల కంప్యూటరీకరణకు ఇంకా ఆపరేటర్లు అవసరం పడడంతో ప్రైవేటు వారిని కూడా తీసుకున్నారు. ప్రతి ఆపరేటర్‌కు ఒక ఐడీ, పాస్‌వర్డ్‌ను కేటాయించి పక్కాగా నమోదు చేయిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 4 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. మధ్యలో సంక్రాంతి సెలవులు రావడంతో కొంత బ్రేక్ పడింది. చివరి రెండు రోజుల్లో మరింత వేగవంతంగా ఆన్‌లైన్ ప్రక్రియను కొనసాగించి టార్గెట్‌ను పూర్తి చేయాలని అధికారులు సంకల్పిస్తున్నారు.

**ఆన్‌లైన్‌లో గ్యారంటీల దరఖాస్తులే నమోదు..**

ప్రభుత్వం ఐదు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించగా.. చాలా మంది ఇతర అంశాలపైనా దరఖాస్తు చేశారు. రేషన్ కార్డు, ఇతర వ్యక్తిగత లబ్ధికి సంబంధించి తెల్లకాగితంపై విజ్ఞప్తులు వచ్చాయి. ఈ తరహా దరఖాస్తులు అర్బన్ ఏరియాలో 47,551 దరఖాస్తులు, రూరల్ ఏరియాలో 48,335 దరఖాస్తులు కలిపి మొత్తం 95,886 వచ్చాయి. అభయ హస్తం దరఖాస్తులను ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేస్తుండగా.. ఇతర సమస్యలపై వచ్చిన దరఖాస్తుల విషయమై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత లేకపోవడంతో వాటిని అధికారులు ఎంట్రీ చేయక పక్కన పెట్టారు. ఈ దరఖాస్తుల విషయంలో ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు లేకపోవడం.. ఇతర దరఖాస్తుల వివరాలు నమోదు చేసేందుకు ఓ నమూనా అంటూ ఏదీ లేకపోవడంతో అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. సంబంధిత దరఖాస్తులను ఎప్పుడు పరిగణనలోకి తీసుకుంటారు? అన్నదానిపై ప్రజల్లో ఎన్నో సందేహాలు నెలకొంటున్నాయి.

